రేపు 'స్పందన' రద్దు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఈ నెల 13న నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం ఉత్తరాంధ్ర పట్టభద్రుల, స్థానిక సంస్థల శాసన మండలి ఎన్నికలు నేపథ్యంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు తెలిపారు. స్పందనకు ఫిర్యాదులతో హాజరు కావాల్సిన వారంతా ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

ఉత్తరాంధ్ర శాసనమండలి

ప్రచారానికి తెర.. ప్రలోభాలకు వల

- ముగిసిన ప్రచారం
- 13న పోలింగ్
- 16న ఫలితాలు
- ఏర్పాట్లలో అధికార యంత్రాంగం
- కులం, ధనం, గిఫ్ట్ ప్యాక్‌లతో చెలరేగిపోతున్న అధికార వైసిపి, ఇతర పక్షాలు
- ప్రభంజనంలా పిడిఎఫ్ ప్రచారం
- ముందంజలో డాక్టర్ కోరెడ్ల రమాప్రభ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం శాసన మండలికి ఈ నెల 13న జరుగనున్న ఎన్నికల ప్రచారానికి శనివారం సాయంత్రం 4గంటలతో గడువు ముగిసింది. ఇంకా 24 గంటల వ్యవధే పోలింగ్‌కు ఉంది. సోమవారం ఉదయం 8గంటలకు ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంలో అన్ని చోట్లా ఎన్నికల్లో పట్టభద్రులు పాల్గొననున్నారు. ఈ జిల్లాల్లో 2,89,214 మంది ఓటర్లు ఎమ్మెల్సీగా తమ అభ్యర్థిని ఎన్నుకోనున్నారు. ప్రోగ్రెసివ్ డెమక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) ప్రచారం ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రభంజనంలా సాగింది. ప్రజా సంఘాల శ్రేణులు విస్తృతంగా పిడిఎఫ్ అభ్యర్థి పేరును పట్టభద్రుల్లో ప్రచారం చేయడంతో ఆమె ముందంజలో ఉన్నారనడంలో ఎలాంటి సందేహమూ లేదు. అనేక సంవత్సరాలుగా ఉత్తరాంధ్ర జిల్లాలను పీడిస్తున్న ప్రధాన ప్రజా సమస్యలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, మహిళా రంగాలకు చెందిన అంశాలే అజెండాగా పిడిఎఫ్ చేపట్టిన ప్రచారం సర్వత్రా ఆమోదయోగ్యంగా నిలిచింది.

ఎమ్మెల్సీ బరిలో ప్రధాన రాజకీయ పార్టీలు

ప్రధాన రాజకీయ పార్టీలైన వైసిపి, తెలుగుదేశం, బిజెపికి చెందిన అభ్యర్థులు బరిలో ఉండడం ఈ దఫా ఒక ప్రత్యేకతగా ఉంది. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి పివిఎన్ మాధవ్‌కు తెలుగుదేశం మద్దతు ఇవ్వడంతో ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా మాధవ్ గెలిచాడు. ఈ సారి ఈ రెండు పార్టీలు వేర్వేరుగా బరిలోకి దిగాయి. దీంతో రూ.కోట్లు ఖర్చుపెట్టి నెగ్గే పనిలో బిజెపి నిమగ్నమైంది. కేంద్రంలో తమ బిజెపి అధికారంలో ఉండడం, రూ.కోట్లు కూడబెట్టుకున్న నేతలకు కొదవు లేకపోవడంతో మాధవ్‌కు నిధులు కూడా వస్తున్నాయన్నది ఇంటెలిజెన్స్ తాజా నివేదికగా ఉంది. తెలుగుదేశం అభ్యర్థి చిరంజీవిరావు కూడా రూ.కోట్లు ఖర్చు చేసేందుకు అన్నీ సిద్ధం చేసుకున్నారు. గత ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి బరిలో లేదు. ఈ సారి రియల్ ఎస్టేట్ వ్యాపారి సీతంరాజు సుధాకర్‌ను ఆ పార్టీ ఉత్తరాంధ్రలో పోటీకి దింపింది. రూ.కోట్ల ఖర్చుతో గట్టెక్కాలని ఇప్పటికే సదరు వ్యక్తి ఓట్ల నమోదులోనూ డబ్బులు పంపకాలకు పాల్పడ్డారు.

చేసిందో తెలిసిందే. డబ్బు పంపిణీ, బహుమతులు, వెండి నాణేలు, చీరలు ఇతర సామగ్రి పంపిణీని పెద్ద ఎత్తున పట్టభద్రులకు ఇవ్వజూపింది. తెలుగుదేశం కూడా ఇదే తోవలోనే నడుస్తోంది. బిజెపి నుంచి సిట్టింగ్ అభ్యర్థే రంగంలో ఉండడంతో పెద్ద ఎత్తున ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తున్నారు.

ప్రభంజనంలా పిడిఎఫ్ ప్రచారం

వీటన్నింటికీ భిన్నంగా డాక్టర్ కోరెడ్ల రమాప్రభ 40వేల మందికి పైగా పట్టభద్రులైన ఓటర్లను ప్రత్యక్షంగా కలిసి ఓటును కోరడం ఈ ఎన్నికల్లో ఓ ప్రత్యేకత. ఉమ్మడి జిల్లాల్లోని మారుమూల ప్రాంతాల్లోకి సైతం ఈమె గళం వెళ్లింది. దీంతో సర్వత్రా పిడిఎఫ్ అభ్యర్థికి పట్టభద్రులు బ్రహ్మరథం పడుతున్నారు. 250 ప్రజా సంఘాలు బలపరచిన వ్యక్తిగా ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంలో ఈమె పేరు మార్మోగుతోంది. నిరుద్యోగ పట్టబద్రులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, మహిళా ఓటర్ల నోటా రమాప్రభ మాటగా వినిపిస్తోంది. ఇలా బరిలో నిలిచిన అంత మంది అభ్యర్థుల దాటుకుంటూ ఓ మహిళా అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ పేరు ముఖ్యమంగా వినిపిస్తుండటంతో అధికార పార్టీ వెన్నులో వణుకు ప్రారంభమైంది. దీంతో పట్టభద్రులను ప్రలోభాలకు గురిచెయ్యాలనే తపనతో వైసిపి శ్రేణులను, బయట నుంచి కిరాయికి తెచ్చుకున్న యువతను వినియోగిస్తూ అక్రమాలకు పాల్పడడంలో వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్ అందెవేసిన చెయ్యిగా నిలిచారు. చాపకింద నీరులా బిజెపి అభ్యర్థి పివిఎన్ మాధవ్ విశాఖలోని ఆ పార్టీ కార్యాలయం నుంచే పంపిణీకి శ్రీకారం చుట్టారు.

రిమ్స్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న రమాప్రభ

మండలిలో ప్రజావాణిని వినిపిస్తా

- విద్య, వైద్యం అందించడంలో ప్రభుత్వం విఫలం
- పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, రణస్థలం

తనను గెలిపిస్తే శాసన మండలిలో ఉత్తరాంధ్ర ప్రజల వాణిని వినిపిస్తానని పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ అన్నారు. శనివారం శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(రిమ్స్), వైద్య కళాశాల, రణస్థలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు విద్య, వైద్యం అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. బాగా వెనుకబడ్డ ఉత్తరాంధ్ర జిల్లాల్లో సరైన వైద్య సదుపాయం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. శ్రీకాకుళం రిమ్స్ వైద్య కళాశాల ఏర్పాటై ఏళ్లు గడుస్తున్నా బాలారిష్టాలు వీడలేదన్నారు. భవనాలు నిర్మించినా మెడికల్ కళాశాల, ప్రజా వైద్యశాలలో పని చేసేందుకు సరిపడ వైద్యులు, ఇతర సిబ్బంది లేరన్నారు. కాంట్రాక్టు సిబ్బందిపై పని ఒత్తిడి పెరుగుతోందన్నారు. వీరిని రెగ్యులర్ చేయాల్సిన ప్రభుత్వం ఏళ్ల తరబడి వెట్టి చాకిరి చేయిస్తోందని విమర్శించారు. జిల్లా నుంచి స్పీకర్, ఇతర శాఖల మంత్రులు ఉన్నా జిల్లాలో అభివృద్ధి కాదు కదా, మరింత వెనుకబాటుకు నెట్టబడుతోందని అన్నారు. 194 కిలోమీటర్ల సుదూర తీర ప్రాంతం కాలుష్యం బారిన పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి ప్యాకేజీ, రైల్వేజోన్, మెట్రో రైల్ వంటి అంశాల్లో రాష్ట్రానికి కేంద్రం ద్రోహం చేసిందని అన్నారు. స్టీల్ ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టిందని చెప్పారు. దీన్ని ప్రశ్నించాల్సిన అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు ఆ పని చేయడం లేదని అన్నారు. ద్రోహం చేసిన కేంద్ర ప్రభుత్వంతో దోస్తీ చేస్తున్నాయని చెప్పారు. ప్రజా సమస్యలపై మండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమే నిలదీస్తున్నారని అన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీల బలం మండలిలో ఎంత పెరిగితే పట్టభద్రులు, వివిధ తరగతుల వాణిని వినిపించే అవకాశం ఉంటుందని చెప్పారు. తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి, గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, ఐద్వా నాయకులు లక్ష్మి. పాణిగ్రాహి, ఆర్.సురేష్‌బాబు, తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ బంగారం పట్టివేత (6లో)

పోలింగ్‌కు పక్కా ఏర్పాట్లు

- నాలుగు కేంద్రాల్లో స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్
- బ్యాలెట్ పత్రాలు, బాక్సులు అంతా సిద్ధం చేశాం
- జెసి ఎం.నవీన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ఈ నెల 13న నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జెసి ఎం.నవీన్ చెప్పారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలకు జిల్లాలో 776 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. జిల్లాలోని నాలుగు ప్రాంతాల్లో పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశామని వెల్లడించారు. శ్రీకాకుళం ఆర్‌డిఒ ఆఫీస్, పాలకొండ ఆర్‌డిఒ ఆఫీస్ మీటింగ్ హాల్, టెక్కలి ఆర్‌డిఒ ఆఫీస్ ఎఒ రూమ్, పలాస తహాశీల్దార్ ఆఫీస్ మీటింగ్ హాల్‌లో పోలింగ్ జరగనుందని తెలిపారు. శ్రీకాకుళం డివిజన్‌లో 249 ఓట్లు, పాలకొండలో 153, టెక్కలిలో 162, పలాసలో 212 ఓటర్లు ఉన్నారని చెప్పారు. పోలింగ్ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జరగనుందని చెప్పారు. సాయంత్రం నాలుగు గంటల తర్వాత క్యూలైన్‌లో ఉన్న వారికి మాత్రం ఓటు వినియోగించుకునే అవకాశం కల్పిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం నుండి 1,000 బ్యాలెట్ పేపర్లు వచ్చాయని, అందులో 81 బ్యాలెట్ పేపర్లు రద్దు కాగా, మిగిలిన వాటిని అన్ని పోలింగ్ కేంద్రాలకు సమానంగా పంపిణీ చేసినట్లు చెప్పారు. అయినా బ్యాలెట్ పత్రాల సమస్య లేదని, రిజర్వులో 118 పేపర్లు ఉన్నాయని తెలిపారు. పోలింగ్‌కు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, ఇతర మెటీరియల్‌ను 12న శ్రీకాకుళం పాలిటెక్నిక్ కళాశాలలో పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాలకు అవసరమైన మెటీరియల్, మౌలిక వసతులు సర్వం సిద్ధం చేశామని, పోలింగ్ అధికారులకు, సిబ్బందికి ఇప్పటికే శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ వెబ్ కెమెరాల ఏర్పాటుతో పాటు మైక్రో అబ్జర్వర్లను నియమించామని చెప్పారు. ఎన్నికల పరిశీలకుల ఆధ్వర్యంలో ఫ్లైయింగ్ స్క్వాడ్స్, పోలీస్ ఫోర్స్, ఎంసిసి టీమ్స్, జోనల్, సెక్టోరియల్ ఆఫీసర్లు తదితరులందరూ అన్ని రకాల శిక్షణ పొంది పోలింగ్, కౌంటింగ్‌కు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్. కౌంటింగ్ ఏజెంట్లను ఇప్పటికే వారు కోరిన విధంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్‌కు గంట ముందు కూడా పోలింగ్, కౌంటింగ్ ఏజెంట్లను ఏర్పాటు చేసుకునే వెసులుబాటు కల్పించామని అన్నారు. ఏజెంట్లు, సంబంధిత నియోజకవర్గ పరిధికి చెందిన వారై ఉండాలన్నారు. శ్రీకాకుళం, టెక్కలి, పలాస నియోజకవర్గం పరిధిలోని వారు వారి నియోజకవర్గాల్లోనే ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. జిల్లాల పునర్విభజన అనంతరం పార్వతీపురం మన్యం జిల్లాలో కలిసిన నాలుగు మండలాలతో పాటు విజయనగరం జిల్లాలో కలిసిన నాలుగు మండలాల పరిధిలోని వారు మాత్రం పాలకొండలో తమ ఓటును వినియోగించుకోనున్నారని ఆయన వివరించారు. ఓటరు స్లిప్పులను ఇప్పటికే పంపిణీ చేయడం జరిగిందని, ఎన్నికల కమిషన్ సూచించిన 11 రకాల గుర్తింపు కార్డుల్లో దేనినైనా చూపించి ఓటు వేయొచ్చన్నారు. వికలాంగులు వేరొకరి సాయంతో ఓటు వేసేందుకు ప్రిసైడింగ్ అధికారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. పోలింగ్ ముగిసిన తరువాత పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులను సీల్ వేసి శ్రీకాకుళం పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముకు తరలించనున్నామని తెలిపారు. ఈ నెల 16న ఓట్ల లెక్కింపు చేపడతామని తెలిపారు.

మాట్లాడుతున్న జెసి నవీన్

ఓటింగ్‌పై అవగాహన కల్పించాలి

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఓటింగ్ విధానంపై ఓటర్లకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు అన్ని రాజకీయ పార్టీలూ సహకరించాలని జెసి నవీన్ అన్నారు. శనివారం జెసి ఛాంబరులో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి పోలీస్ స్టేషన్లు, స్ట్రాంగ్ రూముల ఏర్పాటు, బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రి తరలింపు, భద్రత మొదలైన అంశాలపై చేపట్టిన చర్యలను పార్టీల ప్రతినిధులకు వివరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో వైసిపి ప్రతినిధి, స్వతంత్ర అభ్యర్థి అనెపు రామకృష్ణ, కలెక్టరేట్ పరిపాలనాధికారి రాజేశ్వరరావు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు వేయండి

స్వతంత్ర అభ్యర్థి రామకృష్ణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

స్థానిక సంస్థలను వైసిపి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, స్థానిక సంస్థల ప్రతినిధుల హక్కులను కాపాడుకునేందుకు వీలుగా తనకు శాసనమండలికి పంపించాలని, ఎవరి ప్రలోభాలకూ గురికాకుండా స్వేచ్ఛగా ఓటు వేయాలని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి అనెపు రామకృష్ణ అన్నారు. స్థానిక సంస్థల హక్కులను వైసిపి కాలరాస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఓటు వేసే ప్రక్రియ సీసీ కెమెరాల సమక్షంలో జరుగుతుందని, ఓటర్లను జిల్లాలో ఉన్న ప్రభుత్వ పెద్దలు బెదిరిస్తునారని ఆరోపించారు. బెదిరింపులకు స్థానిక సంస్థల ప్రతినిధులు ఎవరు భయపడాల్సిన పనిలేదన్నారు. వేసే ఓటు అత్యంత రహస్యంగా ఉంటుందని, ఎవరికీ వేశారన్నది స్పష్టత ఉండదని, ఎవరి బెదిరింపులకు లొంగాల్సిన పనిలేదన్నారు. సమావేశంలో పిసిని చంద్రమోహన్, కద్దాల శ్యామ్ సుందరరావు, రాష్ట్ర కోశాధికారి లోలుగు అప్పలనాయుడు, ఎబిబిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసరి బలరాం, తూర్పు కాపు సంక్షేమ సంఘం జిల్లా మహిళా అధ్యక్షులు పిరియా మాధవి, బుచ్చిబాబు, దాసరి వెంకనాయుడు, సేపాన శీనుబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆలస్యంగా వస్తే అనుమతి లేదు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులను ఉదయం 8.45 గంటల నుంచి 9.30 వరకు మాత్రమే పరీక్ష హాల్లోకి అనుమతిస్తామని పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ అలీఖాన్ తెలిపారు. 9.30 గంటల తర్వాత ఆలస్యంగా వచ్చిన ఎవరినీ అనుమతించబోమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని పరీక్షలు నిర్దేశించిన తేదీల్లో ఉదయం 9.30 గంటల నుంచి 12.45 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వికటించిన వ్యాక్సిన్

15 గొర్రెలు మృతి

(6లో)

అధికార బలహీనత!

ప్రజాశక్తి - శ్రీకాకుళం

'అధికార వాంఛ బలం నుంచి కాదు, బలహీనత నుంచే ఉద్భవిస్తుంది".. అని ఎరిక్ ఫ్రామ్ అనే జర్మన్ సైకాలజిస్టు మాటలు ప్రస్తుత ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల సందర్భంగా ప్రధానంగా అధికార వైసిపికి, ఇతర పార్టీలైన టిడిపి, బిజెపిలు అవలంబిస్తున్న అక్రమ మార్గాలు చూస్తే అక్షరాలా నిజమేనని అనిపించక మానదు. అదే సందర్భంలో ప్రజా సంఘాల మద్దతుతో కొన్ని రోజులుగా విలక్షణమైన పద్ధతుల్లో నిరాడంబరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూ వస్తోన్న పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు ఇంకా కొద్దిరోజుల్లో దక్కనున్న ఫలితం దిశగా చూస్తే అమెరికన్ సంఘ సంస్కర్త హెచ్‌డబ్ల్యూ (హెన్రీ వార్డ్) బీచర్ మాటలు "సులభంగా లభించే విజయం సంతృప్తికరంగా ఉండదు. కఠోర పరిశ్రమ అనంతరం వరించే విజయం తియ్యగా ఉంటుంది..' అన్న వ్యాఖ్యలు నిజం చేసేలాగ ఉన్నాయనడంలో ఎలాంటి సందేహం లేదనే చెప్పాలి. ఈ నెల 13న జరుగనున్న ఉమ్మడి ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి(ఎమ్మెల్సీ) ఎన్నికల పోరు సాగనుంది. ఫలితాలు కూడా పై వ్యాఖ్యలకు తగ్గట్టుగానే రానున్నాయనేది వినికిడి. ఓట్లేసే వారంతా బాగా చదువుకున్న వారు, ఉద్యోగాలు చేసేవారు, మేధావులు కావడంతో ప్రధాన పార్టీల పాచికలు ఇక్కడ పారే అవకాశాలు తక్కువ. అధికారం దక్కదనే బలహీనమైన ఆలోచనలతో వీరినీ ప్రలోభాలకు గురిచేసే వ్యూహాలు పన్నుతున్నాయి.

'ధన' ప్రవాహమే ప్రధాన పార్టీల కార్యాచరణ

మునుపెన్నడూలేని రీతిలో సాధారణ ఎన్నికల్లో బరిలో నిలిచే వైసిపి, తెలుగుదేశం, బిజెపి కూడా ఈ శాసన మండలి ఎన్నికలకు 'తగుదునమ్మా' అంటూ పెద్ద ఎత్తున ప్రలోభాలకు గురిచేస్తూ ఎలాగైనా తమ అభ్యర్థిని గెలిపించుకోవాలన్న తాపత్రయం కనిపిస్తోంది. ఉత్తరాంధ్ర జిల్లాల సమస్యలేవీ వారి అజెండాలో మచ్చుకైనా కానరావడం లేదు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ఊసు పట్టదు. వాల్తేరు రైల్వే డివిజన్‌ను ఎత్తేస్తే మాట్లాడరు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ విశాఖ కేంద్రంగా ప్రకటించి ఇవ్వకపోతే పోరాడరు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తుంటే గొంతుకలు మూగబోతాయి. ఉత్తరాంధ్ర ఉమ్మడి జిల్లాలన్నింటినీ ఒక ప్రత్యేక ప్రాంతంగా గుర్తించి బుందేల్‌కండ్ తరహా ఆర్థిక ప్యాకేజీ ఇస్తానంటూ కేంద్రంలోని బిజెపి చేసిన బాసలు ఢిల్లీ గద్దెనెక్కి తుంగలోకి తొక్కినా ఏ పార్టీ ప్రశ్నించదు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని చిన్న నీటిసాగు వనరుల పరిరక్షణ, ప్రాజెక్టుల నిర్మాణంపైనా అధికారంలోని వైసిపి ఒక్కపైసా నిధి కేటాయించలేదు. ఇదీ అధికార వైసిపి, ప్రతిపక్ష తెలుగుదేశం, బిజెపిల తీరు.

ప్రచారంలో నిరాడంబరత, విలక్షణత

ఉమ్మడి జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంలో గడచిన కొద్ది రోజులుగా పట్టభద్రులను కలుసుకుంటూ సమస్యలపై తన అజెండాను సిద్ధం చేసుకుని, నిర్మాణాత్మక పరిష్కారాలను చూపుతూ సాగుతున్న డాక్టర్ కోరెడ్ల రమాప్రభ శైలి పట్టభద్రులను ఆకట్టుకుంటోంది. 250 ప్రజా సంఘాలకు చెందిన శ్రేణులు సాగించే ప్రచారం, విలక్షణతతో పిడిఎఫ్ దూసుకుపోయిందనే చెప్పాలి. మామూలు ఎన్నికల దృష్టితో చూస్తూ ప్రలోభాలకు పాల్పడుతున్న ఈ రాజకీయ పార్టీలతో పోటీ పడడం అనేది పిడిఎఫ్‌కు అత్యంత కత్తిమీద సాము, అతిపెద్ద సాహసమే కాగలదు. అయితే మరోమాటగా చెప్పాలంటే ఈ పార్టీల పరిస్థితిని, ప్రచార సరళిని ఉత్తరాంధ్ర అంతా చూస్తోంది. అధికారం రుచిచూసిన పార్టీలు ఈ ఎన్నికలను డబ్బు మయం చేసేసి నెగ్గాలన్నదే కాంక్షగా కనిపిస్తోంది. శాసన మండలికి మేధావులను పంపించి ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సమస్యలపై సహృద్భావ వాతావరణంలో చర్చలు సాగించాల్సిన వేదికకు రూ.కోట్లు ఖర్చుపెట్టి ఎన్నికల్లో గెలిచే వారిని పంపించాలని చూడడం నిజంగా విచారకరం.

ఓటమితోనే వైసిపి అక్రమాలకు అంతం

ప్రజాశక్తి - పొందూరు

వైసిపి ప్రభుత్వ అక్రమాలకు అంతం పలకాలంటే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిని ఓడించాలని శ్రీకాకుళం పార్లమెంట్ సభ్యులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. మండల కేంద్రంలోని పట్టుశాలి కళ్యాణ మండపంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో వైసిపికి బుద్ధి చెప్పడానికి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు, పట్టభద్రులు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి తప్పదని గ్రహించిన వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో భారీగా దొంగ ఓట్లు నమోదు చేయించిందని, ఇది వైసిపికి వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. దొంగ ఓట్లు నమోదు చేయించడం ద్వారా వైసిపి తమ ఓటమిని అంగీకరించినట్లేనని అన్నారు. వైసిపి ప్రభుత్వం ఎన్ని దొంగ ఓట్లు నమోదు చేసినా, ఎన్ని ఎత్తులు వేసినా, ఓటర్లను ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా వైసిపి అభ్యర్థులకు ఓటమి తప్పదన్నారు. టిడిపి ప్రభుత్వం వస్తే సచివాలయ ఉద్యోగులను తొలగిస్తారని వైసిపి దుష్ప్రచారం చేస్తోందని, రాజ్యాంగబద్ధంగా వచ్చిన ఏ ఉద్యోగిని తొలగించే ప్రసక్తే లేదని, వారికి టిడిపి ప్రభుత్వం మరింత భద్రత కల్పిస్తుందని హామీ ఇచ్చారు. ఓటు హక్కు ఉన్న ప్రతి పట్టభద్రుడు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. ఎంపీతో పాటు టిడిపి మండల అధ్యక్షులు రామ్మోహన్, నాయకులు బలగ శంకర్ భాస్కర్, బి.శేషగిరినాయుడు, ఎంపిటిసి వాణి, అనకాపల్లి శ్రీరంగ, కాళ్లకూరి శాంతారాం, ఎంఎస్ఎన్, బొడ్డేపల్లి సత్యం, పైడి వాసుదేవరావు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు

పొందూరు ఖాదీకి భౌగోళిక గుర్తింపునకు కృషి

ప్రపంచ ప్రఖ్యాత గాంచిన పొందూరు ఖాదీకి భౌగోళిక గుర్తింపు(జిఐ) సాధించేంత వరకు ప్రయత్నాలు కొనసాగిస్తానని శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఖాదీకి భౌగోళిక గుర్తింపు కోసం కృషి చేస్తున్న ఎంపీకి ఎఎఫ్‌కెకె సంఘం ప్రతినిధులు శనివారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ కేంద్రం జీఐ మంజూరుకు సానుకూలంగా ఉందని చెప్పారు. భౌగోళిక గుర్తింపు సాధించే వరకు కేంద్రంతో సంప్రదింపులు, ప్రయత్నం చేస్తానని, అవసరమైతే కేంద్రంతో పోరాటానికైనా సిద్ధమని చెప్పారు. ఖాదీ అభివృద్ధికి తన వంతు పాత్ర ఉంటుందని ఎప్పుడు ఏ సహాయ, సహకారాలు కావాలన్నా అందించడానికి తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ఎంపీని కలిసిన వారిలో ఎఫ్‌కెకె సంఘం అధ్యక్షులు కామేశ్వర ప్రసాద్, సంఘం ఉద్యోగులు ఉన్నారు. వారితో పాటు స్థానిక టీడీపీ నాయకులు ఉన్నారు.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో,టెక్కలి

I.O.No.5/2022

Between:

కూర్మాపు అనీల్‌కుమార్

కూర్మాపు సంతోష్‌కుమార్ ...పిటీషనర్

And:

బర్ల స్వాతి మరియు ఇతరులు ...రెస్పాండెంట్స్

To

R-1: **బర్ల స్వాతి,** W/o శ్రీనివాస్, గొల్లవీధి, టెక్కలి (గ్రామం, పోస్టు & మండలం), శ్రీకాకుళం జిల్లా.

R-2: **కార్తీక్ కుమార్ పాత్రో,** S/o మహేంద్రకుమార్ పాత్రో, చిన్న బ్రాహ్మణ వీధి, టెక్కలి (గ్రామం, పోస్టు & మండలం), శ్రీకాకుళం జిల్లా.

R-3: **దేవాది అప్పలనర్సమ్మ,** W/o లేటు యర్రయ్య నగర్, టెక్కలి (గ్రామం, పోస్టు & మండలం), శ్రీకాకుళం జిల్లా.

R-4: **హనుమంతు సింహాచలం,** S/o అప్పారావు, తొలుసూరుపల్లి గ్రామం, టెక్కలి (పోస్టు & మండలం), శ్రీకాకుళం జిల్లా.

R-5: **దవళ హరి,** S/o ఆనంద్, తొలుసూరుపల్లి గ్రామం, టెక్కలి (పోస్టు & మండలం),శ్రీకాకుళం జిల్లా

R-6: **దాసరి శ్రీరాములు,** S/o లేటు యర్రయ్య, ఆది ఆంధ్రా వీధి, టెక్కలి (గ్రామం, పోస్టు & మండలం), శ్రీకాకుళం జిల్లా.

R-7: **సాసనాపల్లి లత,** W/o క్రిష్ణకుమార్, 9వలైను, యన్.టి.ఆర్. కోలనీ, టెక్కలి (గ్రామం, పోస్టు & మండలం),శ్రీకాకుళం జిల్లా.

R-8: **బర్ల కార్తీక,** S/o గోవింద, గొల్లవీధి, టెక్కలి (గ్రామం, పోస్టు & మండలం), శ్రీకాకుళం జిల్లా.

R-9: **కర్రి శ్రీను** S/o . గంగయ్య, గొల్లవీధి, టెక్కలి (గ్రామం, పోస్టు & మండలం), శ్రీకాకుళం జిల్లా.

R-10: **బమ్మిడి గోవిందు,** S/o నారాయణస్వామి, రవీంద్ర భారతి స్కూలు ఎదురుగా, టెక్కలి (గ్రామం, పోస్టు & మండలం), శ్రీకాకుళం జిల్లా.

R-11: **అంపలాం శివకుమార్,** S/o శేషగిరిరావు, కచేరివీధి, టెక్కలి (గ్రామం, పోస్టు & మండలం), శ్రీకాకుళం జిల్లా.

R-12: **దేవాది ఆదినారాయణ,** S/o. లేటు వెంకటస్వామి, ఆది ఆంధ్రావీధి, టెక్కలి (గ్రామం, పోస్టు & మండలం), శ్రీకాకుళం జిల్లా.

R-13: **నెల్లిపర్తి సింహాచలం,** S/o. NN, ఆమరావతి వీధి, యన్.టి.ఆర్, కోలనీ, టెక్కలి (గ్రామం, పోస్టు & మండలం), శ్రీకాకుళం జిల్లా.

R-14: **బొమ్మాళి నగేష్,** S/o సూరి, కచేరివీధి, టెక్కలి (గ్రామం, పోస్టు & మండలం), శ్రీకాకుళం జిల్లా.

R-15: **కత్తుల మణి,** S/o అప్పలరాజు, గొల్లవీధి, టెక్కలి (గ్రామం, పోస్టు & మండలం), శ్రీకాకుళం జిల్లా.

R-16: **మహంతి విష్ణుకుమార్,** S/o. NN, రైల్వేస్టేషన్ దగ్గర, టెక్కలి (గ్రామం, పోస్టు & మండలం), శ్రీకాకుళం జిల్లా.

R-17: **గంగిట్ల దమయంతి,** S/o అశోక్, శెగిడివీధి, టెక్కలి (గ్రామం, పోస్టు & మండలం), శ్రీకాకుళం జిల్లా.

R-18: **శాసనపురి చంద్రశేఖర్,** S/o లేటు అప్పారావు, శంభానవీధి, టెక్కలి (గ్రామం, పోస్టు & మండలం), శ్రీకాకుళం జిల్లా

R-19: **పడాల ప్రేమ్‌కుమార్,** S/o కనకరాజు, గాసివీధి, టెక్కలి (గ్రామం, పోస్టు & మండలం), శ్రీకాకుళం జిల్లా.

R-20: **చిన్ని శ్రీధర్ నాయుడు,** S/o. గంగరాజు, గొల్లదాసుపేట, టెక్కలి (గ్రామం, పోస్టు & మండలం), శ్రీకాకుళం జిల్లా.

R-21: **బొమ్మాళి హరిశ్చంద్రరావు,** S/o అమావాస్య, కచేరివీధి, టెక్కలి (గ్రామం, పోస్టు & మండలం), శ్రీకాకుళం జిల్లా.

R-22: **ఉర్లాపు మణికంఠ,** S/o లేటు శ్రీను, కచేరి వీధి, టెక్కలి (గ్రామం, పోస్టు & మండలం), శ్రీకాకుళం జిల్లా.

R-23: **అంపలాం రవికుమార్,** S/o శేషగిరిరావు, కచేరివీధి, టెక్కలి (గ్రామం, పోస్టు %డ% మండలం), శ్రీకాకుళం జిల్లా.

R-24: **కొప్పుల కమల** W/o. రాజేంద్ర, అయ్యప్పనగర్, టెక్కలి (గ్రామం, పోస్టు & మండలం), శ్రీకాకుళం జిల్లా.

నోటీస్

పై నెంబరు ఇన్సాల్వెన్సీ పిటీషనులో పిటీషినరు తనను ఇన్సాల్వెంట్గా డిక్లేరు చేయమని కోరుచూ పై నెంబరు పై పిటీషరు దాఖలు చేసినందుకు మీకు నోటీసు నిమిత్తం **తే.23-03-2023 దీకి** వాయిదా అయివున్నవి. ఇందు విషయమై మీకు గల ఆక్షేపనలకు పై తేదీదని పై కోర్టులో **ఉ॥ గం.10-30 ని॥** లకు స్వయంగా గాని, లాయరు ద్వారాగాని హాజరై తెలియ పరుచుకోలయును. లేని ఎడల మీ పరోక్షమందు ఎక్సుర్టీ తీర్మానం జరుపబడునని ఇందుమూలంగా తెలుసుకోవలయును.

ఎ. వైకుంఠరావు

పిటీషనరు తరపు అడ్వకేట్,

టెక్కలి,

సెల్: 8099675089

పోటీలను ప్రారంభిస్తున్న సిఐ ప్రసాదరావు

క్రీడలతో మానసికోల్లాసం

ప్రజాశక్తి- కవిటి

క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం కలిగిస్తాయని ఇచ్ఛాపురం సిఐ ఈశ్వర చంద్ర ప్రసాదరావు అన్నారు. మండలంలోని భైరిపురంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న డే అండ్ నైట్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అద్భుతమైన క్రీడాకారులు ఉన్నారని, ఇటువంటి క్రీడల ద్వారా వారిలోని నైపుణ్యం బాహ్యప్రపంచానికి తెలుస్తోందని అన్నారు. క్రీడాకారులు ఇటువంటి క్రీడా పోటీలను ఉపయోగించుకుని తమ సత్తాచాటాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ కె.రాము, సర్పంచ్ ప్రతినిధి పుల్లట ప్రభాకరరావు, తమరాల జయరామ్, టి.వి.రమణ, శోభన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో సాయి ప్రీతంకు కాంస్యం

ప్రజాశక్తి- సోంపేట

కాంస్య పతకంతో సాయి ప్రీతం

పట్టణంలోని శారద విద్యనికేతన్‌లో ఏడో తరగతి చదువుతున్న కార్లాంకు చెందిన రత్నాల చతుర సాయి ప్రీతం ఇటీవల అనకాపల్లి జిల్లా ఎలమంచిలిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్ తైక్వాండో పోటీల్లో కాంస్య పతకం సాధించాడు. ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి తైక్వాండో పోటీల్లో బంగారు పతకం సాధించి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. 40వ జూనియర్ పోటీల్లో 44 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించాడు. ఈ మేరకు కోచ్ లోకేష్, పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు అభినందనలు తెలియజేశారు.

వినతిపత్రం అందజేస్తున్న పెన్షనర్లు

భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

పెన్షనర్ల భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని పెన్షనర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సిమ్మినాయుడు, బొడ్డేపల్లి జనార్ధనరావు, గౌరవ అధ్యక్షుడు బొడ్డేపల్లి మోహనరావు కోరారు. ఈ మేరకు స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో శాసనసభ స్పీకర్‌ను కలిసి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సబ్ ట్రెజరీ పరిధిలో 1200 మంది విశ్రాంత ఉద్యోగులు ఉన్నారని, విద్య, సాంస్కృతిక, సమావేశాల నిర్వహణకు భవనం నిర్మించడానికి మూడు సెంట్లు ప్రభుత్వ స్థలాన్ని ఉచితంగా కేటాయించాలని కోరారు. ఈ విషయంపై స్పీకర్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం కోశాధికారి హెచ్.వి.సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు బి.నారాయణరావు, బి.వి.రమణ, ఎస్.వాసుదేవరావు, ఎన్.చంద్రశేఖర్, కె.షణ్ముఖరావు పాల్గొన్నారు.

నిర్మించారు... వదిలేశారు

- ప్రారంభానికి నోచుకోని ప్రభుత్వ భవనాలు
- రూ.లక్షల వ్యయం... ఫలితం శూన్యం

ప్రజాశక్తి- బూర్జ

లక్షలది రూపాయలు ప్రభుత్వ ధనం ఖర్చు చేస్తున్నా ఫలితం మాత్రం శూన్యం. రూ.లక్షల వ్యయం చేసి నిర్మించిన ప్రభుత్వ భవనాలను నిర్మించి రోజులు గడుస్తున్నా...


జీవనోపాధుల వనరుల అభివృద్ధి శిక్షణా కేంద్రం

ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. మండలంలోని గోపిదేవపేట గిరిజన గ్రామంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యాన గ్రామీణ జీవనోపాధుల వనరుల అభివృద్ధి శిక్షణా కేంద్రం రూ.పదేళ్ల క్రితం రూ.50 లక్షలతో భవన నిర్మాణం చేపట్టారు. ఈ భవనంలో పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం, సీతంపేట మండలాల, విజయనగరం మండలం రాజాం, శ్రీకాకుళం జిల్లా బూర్జ, సరుబుజ్జిలి మండలాల ఎన్ఆర్ఇజిస్, వెలుగు సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడానికి నిర్మించారు. అలాగే సమావేశాలు సమయంలో సిబ్బంది ఉండేందుకు వీలుగా భవన నిర్మాణం చేపట్టారు. ఇది ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోకపోవడంతో నిరుపయోగంగానే పడి ఉంది.

అలాగే ఇదే గ్రామంలో సీతంపేట సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన సామాజిక భవనాన్ని నిర్మించారు. అయితే భవనం ఇంతవరకు ప్రారంభోత్సవానికి నోచుకోకపోవడం గమనార్హం. గిరిజన గ్రామంలో వివాహాలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు వీలుగా

సామాజిక భవనం

ప్రభుత్వం భవన నిర్మించింది. ఇదీ ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. అయితే ప్రస్తుతం ఈ భవనాలు ప్రారంభానికి ముందే శిథిలావస్థకు చేరుకున్నాయి. పాలకులు, అధికారులు అశ్రద్ధ కారణంగా రూ.లక్షలు ఖర్చువుతున్నప్పటికీ అనుకున్న ఫలితాలు సాధించడంలో సాధ్యం కావడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ భవనాలను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు అటు పాలకులు, ఇటు అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

యువ క్లబ్‌లతో పర్యాటకానికి కొత్త రూపు

రణస్థలం రూరల్: జిల్లాలో పర్యాటక ప్రదేశాలకు బహుళ ప్రచారాన్ని కల్పించి తద్వారా పర్యాటక ప్రాభవాన్ని తీసుకొచ్చేందుకు యువ పర్యాటక క్లబ్‌లు దోహదపడతాయని జిల్లా పర్యాటక శాఖాధికారి నడిమింటి నారాయణరావు అన్నారు. మండలంలోని నడుకుదిటిపాలెంలోని ఎన్ఇఆర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో శనివారం యువక్లబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో వందకు పైగా ఆకర్షణీయ పర్యాటక ప్రదేశాలు ఉన్నాయన్నారు. వాటిని అభివృద్ధి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. టూరిజం కౌన్సిల్ మెంబరు డాక్టర్ యార్లగడ్డ గీతాశ్రీకాంత్ మాట్లాడుతూ మన సంస్కృతి, వారసత్వ సంపద పరిరక్షణకు పర్యాటక ప్రదేశాలు అభివృద్ధి చెందాలన్నారు. నెహ్రూ యువ కేంద్రం సమన్వయ అధికారి ఎన్.ఉజ్వల్ మాట్లాడుతూ పర్యాటక అభివృద్ధి విషయంలో యువజన సంఘాలు సహకరిస్తాయని అన్నారు. జిల్లాలో 31 పర్యాటక ప్రాంతాలు, 41 ప్రాముఖ్యత కలిగిన ఆలయాలు ఉన్నాయని అన్నారు. స్కూల్ చైర్మన్ నడుకుదిటి

ప్రారంభిస్తున్న నారాయణరావు

ఈశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక విజ్ఞానంతో పాటు సమాజ విజ్ఞానం అవసరమని చెప్పారు. స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీదేవి మహంతి మాట్లాడుతూ విద్యార్థులకు టూరిజం యువక్లబ్ వల్ల భవిష్యత్‌లో మంచి ప్రయోజనాలు ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.వి.ఎస్.ప్రసాదరావు, అకాడమిక్ కో-ఆర్డినేటర్ జ్యోతి పాల్గొన్నారు. అనంతరం జాయితీస్థాయిలో నిర్వహించిన ఆర్యభట్ట గణితి పోటీల్లో దక్షిన భారతదేశంలో మొదటి వంద లోపు ర్యాంకుల్లో నిలిచిన స్కూల్ ఎన్ఇఆర్ స్కూల్ విద్యార్థులు ఎన్.భావన, వెలిచెట్టి శివభార్గవి, పి.దిశాంత్‌లకు అభినందించారు.

ప్రతి గింజా కొనుగోలు చేయాలి

శ్రీకాకుళం అర్బన్: ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా రైతులు పండించిన ప్రతిధాన్యం గింజనూ కొనుగోలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం... పండించిన ధాన్యంలో సగానికి మించి కొనుగోలు చేయకపోవడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని టిడిపి నాయకులు, సర్పంచ్‌ల సంఘ జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. శ్రీకాకుళం రూరల్ మండలం సింగుపురం సచివాలయం-2 వద్ద శనివారం రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ఆరుగాలం కష్టించి రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు పూర్తయివుతున్నా భారతదేశంలో ఎన్నడూ ఈ పరిస్థితులు లేదన్నారు. చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తామని చెప్పిన ప్రభుత్వ పాలకుల అసమర్ధతకు ఇది నిదర్శనమన్నారు. రైతులను నట్టేట ముంచేసి... రైతు ప్రభుత్వమని చెప్పుకుంటూ సిఎం జగన్ పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ప్రతి గింజా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

రమాప్రభను గెలిపించాలి

మెళియాపుట్టి : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, రైతు కూలి సంఘం ప్రధాన కార్యదర్శి పోలాకి ప్రసాదరావు కోరారు. మండలంలో చాపర, పెద్దలక్ష్మీపురం, పెద్దజగన్నాథపురం, కోసమాల, వసుంధర, మెళియాపుట్టి, జాడుపల్లి, జోడూరు, పట్టుపురం గ్రామాల్లో పట్టభద్రుల ఓటర్లను శనివారం కలిసి అభ్యర్థించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్తరాంధ్ర వెనుకబాటుతనాన్ని ప్రశ్నించడానికి శాసన మండలిలో గొంతు వినిపించేందుకు ఒక అవకాశం ఇవ్వాలని పట్టభద్రులను కోరారు. పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకోవడం ద్వారా ఉద్యోగులు, ఉపాధ్యాయులు అనేక రంగాలకు చెందిన వారి సమస్యలపై శాసనమండలిలో వినిపించేందుకు అవకాశం కలుగుతుందని అన్నారు.

ప్రశ్నలు వేస్తున్న డిఇఒ పగడాలమ్మ

పాఠశాలల తనిఖీ

కొత్తూరు : మండలంలోని పారాపురం మోడల్ ప్రైమరీ, కుంటిభద్ర ప్రాథమిక, జిల్లా పరిషత్ పాఠశాలలను డిఇఒ జి.పగడాలమ్మ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పలవు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులు సక్రమంగా సమాధానాలు చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈమె వెంట హెచ్ఎం డి.ఎల్.నరసింహం, ఉపాధ్యాయులు ఉన్నారు.

నరేంద్రకుమార్ మృతదేహం

యువకుడు ఆత్మహత్య

పొందూరు: పొందూరు-దూసి రైల్వే మార్గంలోని తుంగపేట సమీపంలో ఎచ్చెర్ల మండలం చిలకపాలెం చెందిన లింగాల నరేంద్ర కుమార్ (22) రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు శనివారం జిఆర్‌పి ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 11 గంటల సమయంలో యశ్వంత్పూర్-హౌరా రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొన్నారు. మృతుడి తండ్రి కోటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతదేహానికి జిల్లా సర్వజనాస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

వికటించిన వ్యాక్సిన్ 15 గొర్రెలు మృతి

విలపిస్తున్న బాధితుడు

సంతబొమ్మాళి : మండలంలోని పాల తలగాంలో గొర్రెలకు ఇచ్చిన వ్యాక్సిన్ వికటించి కర్రి అప్పన్నకు చెందిన 15 గొర్రెలు మతి చెందగా, మరో 35 గొర్రెలు అస్వస్థతలకు గురయ్యాయి. బాధిత గొర్రెల యాజమాని అందించిన వివరాలు ప్రకారం... నాలుగు రోజులు క్రితం గ్రామ సచివాలయంలోని వెటన్నరీ అసిస్టెంటక్ష స్రవంతి గొర్రెల పొక్కుల వ్యాధి నివారణకు వ్యాక్సిన్ ఇచ్చింది. ఈ వ్యాక్సిన్ బాధితుడు అప్పన్న పొలాకి మండలం వనవిష్ణుపురానికి చెందిన వ్యక్తితో గొర్రెలకు వేయించాడు. వ్యాక్సిన్ వేసిన తర్వాత రోజు నుంచి గొర్రెలు అస్వస్థతకు గురై 15 గొర్రెలు మృత్యవాత పడ్డాయి. మరో 35 గొర్రెలు అస్వస్థతకు గురైయి మత్యవాతకు దగ్గరగా ఉన్నాయని గొర్రెల యాజమాని అప్పన్న లబోదిబోమంటూ విలపిస్తున్నాడు. తనకు గొర్రెలే జీవనాధారమని అంటూ వాపోయాడు. ఏడాది క్రితం వచ్చిన వ్యాక్సిన్ ఇప్పుడు ఇవ్వడం వల్లే చికటించి ఉంటుందని జోరుగా ప్రచారం జరుగుతుంది. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. దీనిపై మండల పశువైద్యాధికారి అప్పలసూరి వివరణ కోరగా, ప్రస్తుతం పిపిఆర్ వ్యాక్సిన్ వేస్తున్నామని, గొర్రెలు మృత్యవాతపై విచారణ చేపట్టి నివేదిక ఉన్నతాధికారులకు అందజేస్తానని తెలిపారు.

ఎగసిపడుతున్న మంటలు

జీడితోటలు దగ్ధం

ప్రజాశక్తి- కవిటి

కవిటి - కొత్తూరు గ్రామాల మధ్యలో ఉన్న కొత్త కోలనీ సమీపంలో ఉన్న జీడి తోటల్లో శనివారం సాయంత్రం భారీ అగ్నప్రమాదం సంభవించింది. తక్కువ సమయంలోనే మంటలు వ్యాపించడంతో సమీపంలో రైతుల తోటలు మంటల్లో కాలిపోయాయి. సుమారు పది ఎకరాల్లో మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న స్థానిక సర్పంచ్ పూడి లక్ష్మణరావు స్థానిక పోలీసులకు, సోంపేట అగ్నిమాపక కేంద్రానికి, ఉద్యానశాఖ అధికారులకు సమాచారం అందించారు. తోటల్లో ఉన్న చెత్త, ఎండుకమ్మలు కాల్చేందుకు పెట్టిన మంట వ్యాపించి ఈ అగ్నిప్రమాదం సంభవించినట్టు స్థానికులు చెబుతున్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న సోంపేట అగ్నిమాపక సిబ్బంది కె.భాస్కరరావు, పి.రామచంద్రరావు, ఎస్.వరహాలు శకటంతో చేరుకుని స్థానికుల సహాయంతో మంటలు అదుపు చేశారు. కవిటి విఆర్ఒ నారాయణ, విఆర్ఎ కాళీ స్థానికులను అప్రమత్తం చేసి అగ్నిమాపక సిబ్బందికి పూర్తి సహాయ సహకారాలు అందించారు. తెల్లవారితే కానీ ఎంతమేరకు నష్టం జరిగిందో చెప్పలేమని విఆర్ఒ తెలిపారు.

అక్రమ బంగారం పట్టివేత

ప్రజాశక్తి- ఆమదాలవలస

కోల్‌కత్తా నుంచి అక్రమ బంగారాన్ని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నట్లు డైరెక్టేట్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ విశాఖపట్నం యూనిట్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల్లోకి వెళ్తే... కలకత్తా నుంచి హౌరా-చెన్నై మెయిల్ రైలులో బంగారాన్ని అక్రమంగా ట్రాలీ బ్యాగ్‌లో తరలిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. ఈ మేరకు శ్రీకాకుళం రోడ్ రైల్వే స్టేషన్‌లో మాటువేసి ఈ నెల 9న వారిని పట్టుకున్నామని అన్నారు. వారి వద్ద నుంచి 7.396 (99.9) కేజీల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. దీని విలువ సుమారు రూ.4.21 కోట్లు ఉంటుందని అంచనా వేశామన్నారు. వీరిని విశాఖపట్నం తరలించి అక్కడ విచారించగా, బంగ్లాదేశ్ నుంచి కోల్‌కత్తాకు అక్రమంగా ఇక్కడకు తరలిస్తున్నట్లు నిందితులు తెలిపారని అధికారులు పేర్కొన్నారు. కస్టమ్స్ యాక్టు ప్రకారం ఇద్దరు వ్యక్తులను ఈ నెల 10న కోర్టులో హాజరపరిచి జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. దీనిపై జిఆర్‌పి, ఆర్‌పిఎఫ్ అధికారులను వివరణ కోరగా, తమ ఎటువంటి సమాచారం లేదని తెలిపారు.

కాలువను శుభ్రం చేయరూ...

కాలువలో పేరుకుపోయిన చెత్త చెదారం

శ్రీకాకుళం : నగరంలోని పి.ఎన్.కాలనీ పదో లైను కవిత స్కూల్ సమీపంలో ఎనిమిదేళ్ల క్రితం నాలుగు అడుగుల కాలువను నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కాలువలో పేరుకుపోయిన చెత్తా చెదారాలను తొలగించలేదని కాలనీ వాసులు వాపోతున్నారు. దీంతో రాత్రి, పగలు అనే తేడా లేకుండా దోమలు విజృంభిస్తుండడంతో రోగాల బారిన పడుతున్నామని ఆందోళన చెందుతున్నారు. భైరివానిపేట సచివాలయానికి ఫిర్యాదు చేస్తే... సిబ్బంది వచ్చి తూతూమంత్రంగా దోమల నివారణకు మందులను పిచికారీ చేస్తున్నారని వివరించారు. కొద్ది రోజుల తరువాత మళ్లీ యథావిధిగా దోమలు విజృంభిస్తున్నాయని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి రోజూ కాలువల్లోని పూడికలను తొలగించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

తల్లిదండ్రుల సమావేశం రసాభాస

ప్రశ్నిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

బూర్జ: మండలంలో పాలవలస జిల్లా పరిషత్ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయులు మాలితి ఆధ్వర్యాన శనివారం నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం రసాభాసగా మారింది. తల్లిదండ్రులకు ఒక్కొక్క ఉపాధ్యాయులు విద్యార్థులకు ఇప్పటి వరకు చెప్పిన సబ్జెక్టుల కోసం వివరించారు. సోషల్ ఉపాధ్యాయులు వివరించేసరికి తల్లిదండ్రులు ఒక్కసారిగా ఆందోళనకు దిగారు. సంబంధిత ఉపాధ్యాయులు సక్రమంగా పాఠాలు బోధించకపోవడంతో గతేడాది పదో తరగతిలో 26 మంది విద్యార్థులు సోషల్ సబ్జెక్టు తప్పిపోయారని, ఈ ఏడాదీ అదే పరిస్థితి నెలకొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్ఎంకు పలుమార్లు చెప్పినా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లకపోవడానికి అంతరాయం ఏమిటని నిలదీశారు. తమ పిల్లలపై బాధ్యత గల ఉపాధ్యాయులు పట్టించుకోకపోతే తాము ఈ పాఠశాలలో తమ పిల్లలను చదివించడం ఎందుకని ప్రశ్నించారు. ఇప్పటికైనా సోషల్ సబ్జెక్టు చెప్పేందుకు మరొక ఉపాధ్యాయులను నియమించాలని, లేకుంటే వచ్చే ఏడాదికి ఈ స్కూల్ నుంచి తమ పిల్లలను తీసుకెళ్లిపోతామని తల్లిదండ్రులు హెచ్చరించారు.

ఆకట్టుకున్న ఆర్ఆర్ఆర్ చిత్ర సన్నివేశం

ఇచ్ఛాపురం : 95వ అకాడమీ అవార్డుల సందర్భంగా సినీ దర్శకులు రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన ఆర్ఆర్ఆర్ చిత్రానికి ఆస్కార్ అవార్డుకు నామినేట్ అయిన విషయం విదితమే. ఈ సందర్భంగా మండలంలోని ముచ్చింద్ర ఎంపిపి స్కూల్ విద్యార్థులు చిత్ర సన్నివేశాన్ని శనివారం ప్రదర్శించారు. ఈ సన్నివేశాలు పలువురిని కట్టేపడేసింది. చిత్రా బృందానికి శుభాకాంక్షలు చెప్పేందుకు అధ్యాపక బృందం విద్యార్థులతో ప్రదర్శించిన చిత్ర సన్నివేశాలు అందరి చేత శభాష్ అనిపించుకున్నారు. పాఠశాల హెచ్ఎం అధ్యాపక బృందానికి, విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

ఆర్ఆర్ఆర్ చిత్ర సన్నివేశాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు



పరిశీలిస్తున్న తహశీల్దార్ గురుప్రసాద్

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ గురుప్రసాద్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో పంజావీధిలోని మున్సిపల్ స్కూల్‌లో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బందలు తలెత్తకుండా పోలింగ్ ప్రశాతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఈయనతో పాటు డిటి శ్రీహరి, రెవెన్యు సిబ్బంది ఉన్నారు.

డీవార్మింగ్ డేను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

నేషనల్ డీ వార్మింగ్ డేను విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ కె.అప్పలనాయుడు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బందితో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 14న నిర్వహించనున్న నేషనల్ డీ వార్మింగ్ డేలో విద్యార్థినీ విద్యార్థులకు ఆల్బండజో టాబ్లెట్లను ఇవ్వాలన్నారు. దీనివల్ల నులిపురుగులు నశించి విద్యార్థిని విద్యార్థులలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు సరిపడా ఆల్బండజో టాబ్లెట్లను పాఠశాల ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేశారు. అనంతరం వాటిని ఏ విధంగా వినియోగించాలి అనే దానిపై డెమో క్లాసును నిర్వహించారు. కార్యక్రమంలో ఫార్మసిస్టు చింతాడ వరుణ్‌కుమార్, రామకృష్ణ, డేటా ఆపరేటర్లు హేమంత్, ధనుంజయరావు, రమేష్, ఉమా మహేష్, ఎఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు, విద్యాశాఖ రికార్డు అసిస్టెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.


మాత్రలను అందజేస్తున్న కమిషనర్ అప్పలనాయుడు

ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారు

టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్

మాట్లాడుతున్న కూన రవికుమార్

ఆమదాలవలస : గ్రాడ్యుయేట్లు వైసిపికి ఓట్లు వేయాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం చెప్పడం హాస్యాస్పదంగా ఉందని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. గడచిన ఎన్నిక ప్రచారంలో సిఎం జగన్మోహన్‌రెడ్డి చంద్రబాబునాయుడు కంటే ఎక్కువ ప్రయోజనాలు ఉద్యోగులకు కల్పిస్తామని కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చారని అన్నారు. అధికారంలోకి నాలుగేళ్లు అవుతున్నా ఉద్యోగుల హామీలు ఒక్కటీ అమలు చేయలేదని పేర్కొన్నారు. నియోజకవర్గంలో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గొండు రమణ తదితరులు పాల్గొన్నారు.

పలాస: అధికార పార్టీ ఓటర్లను ప్రలోభాలు పెడుతున్నారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష విమర్శించారు. పలాస టిడిపి కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు నిత్యం వేధిస్తూ ఎమ్మెల్సీ ఓట్లు ఎలా అడుగుతున్నారని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ఓట్లు వేసే ముందు విద్యావంతులు ఆలోచించాలన్నారు. శాసన మండలిలో రాష్ట్ర సమస్యలపై ప్రశ్నించే వారికి స్థానం కల్పిస్తే రాష్ట్రాభివృద్ధి చెందుతుందన్నారు. వైసిపి ప్రభుత్వం ఎన్నో రకాలుగా ఎన్నికల నియమాలను ఉల్లంఘిస్తుందని ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో గ్రామాల్లో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా వైసిపి పోస్టర్లు కనిపిస్తుండడం ఈ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమన్నారు. విద్యార్థుల భవిష్యత్ తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను అనేక ఇబ్బందులకు గురిచేసిన ఈ ప్రభుత్వానికి సరైన గుణపాఠం చెప్పాలన్నారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోడగల కామేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, గురిటి సూర్య నారాయణ, గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, నవీన్, సురాడ మోహనరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గౌతు శిరీష

'శర్వాణి'లో ప్రాజెక్టు డే

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని అరసవల్లి రోడ్డులో ఉన్న శర్వాణి విద్యాలయంలో ప్రాజెక్టు డేను విశ్రాంత డిఇఒ బలివాడ మల్లేశ్వరరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత, కమ్యూనికేషన్ స్కిల్స్ వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. తెలుగు, ఇంగ్లీషు, హిందీ భాషాపటిమను నేర్పుతున్న తీరును ప్రశంసించారు. స్కూల్ డైరెక్టర్ అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖ వికాసాన్ని కాంక్షించి ప్రాజెక్టు డే, స్పోర్ట్స్ డే, ఏన్యువల్ డే, ఫీల్డ్ ట్రిప్స్, మెరిట్ క్యాంప్స్, ఎక్స్కర్షన్స్ వంటి ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అలాగే స్ఫూర్తి కలిగించే వ్యక్తులతో విద్యార్థులకు ప్రేరణ తరగతులు బోధిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ప్రతి అంశంపైనా పరిపూర్ణ అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రేఖ మాట్లాడుతూ ఇటువంటి విశిష్ట కార్యక్రమాల ద్వారా విద్యార్థికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. డ్యాన్స్, యోగా, కరాటే, మ్యూజిక్ ప్రత్యేక నిపుణుల ద్వారా విద్యార్థులకు బోధిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న మల్లేశ్వరరావు

ఉపాధ్యాయులపై ఆంక్షలు తగవు

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో ఈ నెల 13న జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఉపాధ్యాయులకు కొంతమంది ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు అనేక ఆంక్షలు, ఇబ్బందులు పెడుతున్నారని, ఇది ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని ఫ్యాప్టో జిల్లా అధ్యక్షులు మజ్జి మదన్మోహన్, సెక్రటరీ జనరల్ కె.అప్పలరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యయుతంగా ఓటు హక్కును వినియోగించుకునే స్వేచ్ఛ ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు ఉందన్నారు. ఉపాధ్యాయులను స్వేచ్ఛయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఎలక్షన్ కమిషన్ 13న ప్రత్యేక క్యాజువల్ సెలవు మంజూరు చేసిందని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా ఎమ్మెల్సీ ఓటు హక్కు వినియోగించుకోవడానికి సంబంధించి ప్రత్యేక క్యాజువల్ సెలవు మంజూరు చేసినట్లుగా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు. అందువల్ల ఓటు హక్కును వినియోగించుకునే వీలు ఉపాధ్యాయ ఓటర్లకు ఉందన్నారు. ఈ విషయంలో ఎటువంటి వివాదాలకు తావు లేదన్నారు. ఇప్పటికే ఈ సమస్యపై జిల్లా విద్యాశాఖ అధికారికి లేఖ రాసినట్టు తెలిపారు. ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ప్రత్యేక క్యాజువల్ సెలవును వాడుకుని ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.

దర్యాప్తు చేస్తున్న అధికారులు

మశాకపురం సర్పంచ్‌పై అట్రాసిటీ కేసు నమోదు

ఇచ్ఛాపురం : మండలంలోని మశాకపురం సర్పంచ్ ఆసి తులసమ్మ, మాధవ్‌తో పాటు మరో పది మందిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేశామని రూరల్ ఎస్ఐ రామ కృష్ణ తెలిపారు. గ్రామంలోని దళితవీధిలో నిర్మించిన సిసి రోడ్డు విషయంలో జరిగిన ఘర్షణలో సర్పంచ్‌తో పాటు మరో పది మంది కులం పేరుతో దూషించి దాడి చేశారని అన్నా రు. దళితుల ఫిర్యాదు మేరకు కాశీబుగ్గ డిఎస్‌పి శివరామిరెడ్డి, తహశీల్దార్ గురుప్రసాద్ శనివారం సమగ్ర దర్యాప్తు చేపట్టారని పేర్కొన్నారు. దర్యాప్తు అనంతరం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అప్పలనాయుడు పరామర్శ

లావేరు : మండలంలోని పెదలింగలవలసకి చెందిన గొర్లు ప్రసాద్ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శ్రీకాకుళంలోని ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల నియోజకవర్గం వైసిపి నాయకులు లుకాలాపు అప్పలనాయుడు శనివారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు ఆరోగ్యంపై ఆస్పత్రికి చెందిన వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ప్రసాద్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈయనతో పాటు మాజీ సర్పంచ్‌లు గొర్లె రామినాయుడు, శివంగం నాగరాజు, నారాయణరావు, పి.గురునాయుడు ఉన్నారు.

పరామర్శిస్తున్న అప్పలనాయుడు

సిఎం దృష్టికి ఉపాధ్యాయుల సమస్యలు

శాసనసభ స్పీకర్ తమ్మినేని

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎస్‌టియు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ప్రభాకరరావు కోరారు. స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం సీతారాం మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యను రెగ్యులర్ ప్రాతిపదికన పదోన్నతి, వేతన స్థిరీకరణ చేసే విధంగా సిఎం జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీఇచ్చారు. విద్యార్థులకు అవసరమైన సబ్జెక్టు ఉపాధ్యాయులను ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. సమాన పనికి సమాన వేతనం అనే మౌలిక కార్మిక న్యాయ సూత్రాల ఆధారంగా ఎటువంటి ఆర్థిక నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం చూస్తుందని భరోసా ఇచ్చారు. స్పీకర్‌ను కలిసిన వారిలో జిల్లా నాయకులు ఎస్.వి.రమణమూర్తి, బగాన రమణమూర్తి, కోన కృష్ణారావు, గురుగుబెల్లి భాస్కర్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

పోలయ్య మృతి తీరనిలోటు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నాగవంశం సంక్షేమ సంఘం నాయకులు, ఎచ్చెర్ల మండలం చిలకపాలెం గ్రామ మాజీ సర్పంచ్ డొంక పోలయ్య మృతి సంఘానికి తీరని లోటని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు మొకర వెంకట మల్లేశ్వరరావు అన్నారు. నగరంలోని సిపిఐ కార్యాలయంలో పోలయ్య సంస్మరణ సభ సంఘం ఆద్వర్యాన శనివారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిలకపాలెం సర్పంచ్‌గా నాలుగుసార్లు ఎన్నికై అనేక సేవలు అందించారని అన్నారు. ఆయన హయాంలోనే గ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మల్లిక సూర్యనారాయణ, కార్యదర్శి ముని శ్రీనివాసరావు, కంటుబుక్క నూకరాజు, రాంభక్త మంగరాజు, బోను రాజేశ్వరరావు, పొడుగు శ్రీను, కనకల రామారావు, బుగత అప్పలనాయుడు, బోను ప్రసాద్, ఎచ్చెర్ల రవికుమార్, పొడుగు నరసింహారాజు, బోను దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

చిన్నారులకు 'అక్షర పరిచయం'

ఇచ్ఛాపురం : మండలంలోని మండపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న భవానీపురం అంగన్వాడీ కేంద్రం ప్రీ స్కూల్‌లో చిన్నారులకు శనివారం అక్షర పరిచయ కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులకు సున్న నుంచి పరిచయం చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త పి.నరసమ్మ, చిన్నారులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న యశోద

మధ్యాహ్న భోజనం పరిశీలన

సోంపేట : మండలంలోని పాలవలస పంచాయతీ కుమ్మరిపాడు ప్రభుత్వ పాఠశాలను జెడ్‌పిటిసి తడఖ యశద శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. విద్యాబోధన, మధ్యాహ్న భోజన పథకం అమలు వంటి అంశాలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాలను, విద్యార్థులకు అందిస్తున్న కోడి గుడ్లను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు అందజేశారు. అనంతరం పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పలాసపురం సర్పంచ్ తడక జోగారావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీవామృతంతో నేల సారవంతం

ఆమదాలవలస : మండలంలోని నిమ్మతొర్లాడలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మండల యాంకర్ నక్క చిరంజీవిరావు ఆధ్వర్యాన రైతులతో ఐదు టన్నుల ట్రిప్ టు ఘనజీవామృతాన్ని తయారు శనివారం చేయించారు. రైతులు ప్రకృతి సేద్యంలో జీవామృతం, ఘనజీవామృతాలను పంటలకు ఉపయోగించడం వల్ల భూమి గుల్లబారుతుందన్నారు. నేలలో వానపాముల సంఖ్య గణనీయంగా పెరిగి పంటలకు అవసరమైన అన్ని పోషకాలు సమృద్ధిగా అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సురేష్, తిరుపతి, లక్ష్మి, కృష్ణవేణి పాల్గొన్నారు.

జీవామృతం తయారు చేస్తున్న రైతులు

సకాలంలో లక్ష్యాలను పూర్తి చేయాలి

ఎపిఎం కూర్మారావు

సమీక్షిస్తున్న ఎపిఎం కూర్మారావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ స్వయంశక్తి సంఘాలకు నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. పట్టణంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సిబ్బందితో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో స్వయంశక్తి సంఘాల్లో సభ్యులుగా ఉండి వారి కుటుంబ జీవనోపాధులను మెరుగుపర్చుకోవడానికి ఆసక్తి ఉన్న మహిళలను గుర్తించామన్నారు. వారికి అవసరమైన పెట్టుబడి సహాయాన్ని స్త్రీనిధి ద్వారా మార్చి 31 లోగా రూ.6 కోట్లు లక్ష్యంగా నిర్ధారించినట్లు తెలిపారు. గతంలో ఇచ్చిన స్త్రీనిధి రుణాల రికవరీ వంద శాతం ఉండేటట్లు చూడాలని సిబ్బందిని ఆదేశించారు. వైఎస్ఆర్ చేయూత లబ్ధిదారుల జీవనోపాధులకు వారికి ఆసక్తి ఉన్న రంగంలో నైపుణ్యాలను మెరుగుపరిచి యూనిట్లు స్థాపించుకోవడానికి అవసరమైన రుణాలను ఇప్పించాలని తెలిపారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు బ్యాంకు ఖాతాలు ఓపెన్ చేయించి ఆన్‌లైన్‌లో ఆధార్ నంబరుతో సహా నమోదు చేయించాలన్నారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అకౌంటెంట్ కళ్యాణి, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు సుభద్ర, ఉమా, రమణ, చంద్రరావు, డేటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్ పాల్గొన్నారు.

'ఆరోగ్య భారత్' ఆవిష్కరణే లక్ష్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆరోగ్య భారత్ సాధనలో వాకర్స్ పాత్ర ఉంటుందని వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ చైర్మన్, స్టార్ డోనర్ కె.రామానందం అన్నారు. నగరంలోని స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన నిర్మిస్తున్న యోగా భవన నిర్మాణ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంతా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటూ సామాజిక ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ప్రతి వాకరూ సామాజిక సేవల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అంతకంటే ముందు వాకర్స్ ఇంటర్నేషనల్ చీఫ్ కో-ఆర్డినేటర్ పి.జి.గుప్తా, స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు శాసపు జోగినాయుడులు రామానందంకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ ఏరియా వైస్ ప్రెసిడెంట్ విజయలక్ష్మి, వాకర్స్ ఇంటర్నేషనల్ 102 గవర్నర్ కర్రోతు సత్యం, మాజీ గవర్నర్లు జి.ఇందిరాప్రసాద్, గుడ్ల సత్యనారాయణ, కూన వెంకటరమణమూర్తి, కొంక్యాన మురళీధర్, డిప్యూటీ గవర్నర్ వూన్న నాగభూషణ్ పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న రామానందం

నేటి నుంచి పైడితల్లి అమ్మవారి యాత్ర

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు గ్రామదేవత పైడితల్లి అమ్మవారి 38వ యాత్ర ఆదివారం నుంచి ప్రారంభమవుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మూడు రోజుల పాటు యాత్రను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు అమ్మవారి ఆలయాన్ని, పరిసర ప్రాంతాలను సుందరంగా తీర్చిదిద్దామని చెప్పారు. మూడు జిల్లాల నుంచి లక్షలాది మంది యాత్రికులు దర్శించుకుంటారని తెలిపారు. యాత్రికులకు అసౌకర్యం కలుగకుండా కమిటీ అన్ని ఏర్పాట్లు చేస్తోందన్నారు. మంగళవారం దర్శించుకోనున్న యాత్రికులకు మాజీ సర్పంచ్ కాకర్ల పైడిలింగం భోజన ఏర్పాటు చేశారని తెలిపారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆర్‌టిసి విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని విశ్రాంత ఆర్‌టిసి ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఆర్.పి.రావు అన్నారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న సంఘం కార్యాలయంలో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిఎఫ్ఓ ఇచ్చిన అవకాశాలను అనుసరించి హయ్యర్ పెన్షన్స్‌కు జాయింట్ ఆప్షన్స్ ఐదో డిపోల పరిదిలో ఉన్న విశ్రాంత ఉద్యోగులకు ఇచ్చేందుకు యాజమాన్యం అనుమతించినట్టు తెలిపారు. భవిష్యత్‌లో పెన్షన్స్‌పై ప్రభుత్వ పరంగా ఎటువంటి మార్పులు ఉన్నా విశ్రాంత కార్మికులకు సమాచారాన్ని అందజేస్తామన్నారు. అలాగే సిఎల్, గ్రాడ్యూటీ గతంలో పొందని ఉద్యోగులకు అర్హతను బట్టి ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. 2021 తరువాత ఉద్యోగ విరమణ పొందిన వారికి రావాల్సిన బకాయిలు, లీవ్ ఎంక్యాష్‌మెంట్లపై ఆర్‌టిసి ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేయనున్నట్టు తెలిపారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.అప్పారావు, ఎస్.ఎస్.ఆర్.శర్మ, కొర్లాం గణేశ్వరరావు, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు ఎం.పెంటయ్య, జిల్లా కోశాధికారి జామి ప్రసాద్, బొత్స గౌరు, ఆర్.రామారావు, ఎం.రామారావు పాల్గొన్నారు. అంతకుముందు వివిధ కారణాలతో మృతి చెందిన విశ్రాంత ఉద్యోగులకు సంతాపం తెలిపారు.

సమ్మె విరమణ

కవిటి: జీతాలు చెల్లించాలని కోరుతూ ఐదు రోజు లుగా సమ్మె చేస్తున్న ఉద్దానం తాగునీటి పథకం సిబ్బంది తమ సమ్మెను తాత్కాలికంగా విరమించారు. ఈ మేరకు శనివారం సమావేశమైన వీరు గ్రామాల్లో తాగునీటి సమస్యలు, సాయిరాజ్‌తో చర్చించిన అంశాలపై సమీక్షించుకున్నారు. జిల్లా గ్రామీణ తాగునీటి సరఫరా కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు బెందాలం రమణమూర్తి మాట్లాడు తూ శు క్రవారం సమ్మె శిబిరాన్ని సందర్శించిన సాయిరాజ్ జీతాలపై హామీ ఇవ్వడంతో పాటు వేల మందికి నీటికి ఇబ్బందులు కలగకూడదనే సదుద్దేశంతో ఈనిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు.

వినతిపత్రం అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఆలయ అభివృద్ధికి కృషి

కవిటి: స్థానిక బెహరా వీధిలోని పురాతనమైన జగన్నాథ స్వామి ఆలయ పునర్నిర్మాణం, అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని జనసేన నాయకుడు లోళ్ల రాజేష్ హామీ ఇచ్చారు. స్థానికుల ఆహ్వానం మేరకు శనివారం ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ మేరకు స్థానికుల ద్వారా ఆలయ వివరాలు తెలుసుకున్నారు. ఎన్నో ఏళ్లుగా పునర్నిర్మాణ దశలోనే ఆలయం నిలిచిపోవడంపై విచారం వ్యక్తం చేశారు. స్థానికుల వినతిపై ఆలయ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, బెహరా వీధి పెద్దలు, జన సైనికులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

మెళియాపుట్టి : మండలంలోని 852 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహశీల్దార్ పి.సరోజని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13న చాపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఓటు హక్కును పట్టభద్రులు విధిగా వినియోగించుకోవాలని కోరారు.

పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ గణపతి

డ్రెయినేజీ నిర్మాణ పనులు పరిశీలన

సోంపేట: మండలంలోని కొర్లం పంచాయతీ పరిధి రాజీవ్‌నగర్ వీధిలో డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. గతంలో వీధిలో డ్రెయినేజీ లేకపోవడంతో మురుగు నీరు అంత రోడ్లపైకి చేరి దుర్గంధం వెదజల్లుతుండేదని తెలిపారు. పంచాయతీ నిధులతో డ్రెయినేజీ నిర్మాణం చేపట్టడంపై ఆనందం వ్యక్తం చేశారు. డ్రెయినేజీ నిర్మాణం పనులను సర్పంచ్ ప్రతినిధి రామ్‌బుడ్డి గణపతి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు సంగారు ఢిల్లీశ్వరరావు, ఎస్.రామస్వామి, తామడ మోహన్, పెద్దింటి ముకుందరావు అభినందించారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి

సీతంపేట: పదో తరగతి విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదివితే ఉత్తీర్ణత తప్పనిసరిగా సాధించవచ్చని మండలంలోని దోనుబాయి గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొండ గొర్రె సుబ్బారావు అన్నారు. ఆ పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం సుబ్బారావు మాట్లాడుతూ పరీక్షలు సమీపిస్తున్నాయని, తక్కువ సమయం ఉన్నందున అలక్ష్యం చేయకుండా చదువుకోవాలని కోరారు.